ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శనివారం 6 సెప్టెంబరు 2025

నిత్య శోధనతో కొత్త బోధన



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్


హాజరైన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు ఇలాగే ఉండాలి

అప్పుడే విద్యార్థులకు సంపూర్ణ జ్ఞానం

గురుపూజోత్సవాలలో జేసీ అభిషేక్ కుమార్

కొత్తచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినూత్న బోధన కోసం ఉపాధ్యాయులు నిత్యం అన్వేషించాలని, అప్పుడే విద్యార్థులకు సంపూర్ణ జ్ఞానం అందించగలుగుతారని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. విద్యార్థి విజయానికి పునాది వేసేది ఉపాధ్యాయులే అని అన్నారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సమీపంలోని మంగళకర పాఠశాలలో జిల్లా విద్యాశాఖ శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవాలలో ఆయన పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ ప్రపంచంలో కొన్ని వందల వృత్తులు ఉన్నాయని, ఆ వృత్తులను చేపట్టేవారిని తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. అందుకే ఆ వృత్తి అంటే తనకు ఎంతో గౌరవమని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి పుట్టిన సెప్టెంబరు 5వ తేదీని ఏటా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. ప్రతి గురువు నిత్య విద్యార్థి అని అన్నారు. జ్ఞానాన్ని సంపాదించడానికి ఎన్నో మార్గాలున్నాయని, కానీ ఉపాధ్యాయుడు లేకుండా జ్ఞానాన్ని సంపాదించడం సాధ్యం కాదని అన్నారు. సమాజంలో ఎలా మెలగాలి, ఎలా మాట్లాడాలి అనే అంశాలను ప్రతి ఒక్కరూ గురువు వద్దనే నేర్చుకుంటారని అన్నారు. ఉపాధ్యాయులు ప్రతిక్షణం విద్యార్థుల ప్రవర్తనను గమనించాలని, వారికి మంచి దారిని చూపాలని అన్నారు. తన తండ్రి కూడా ఉపాధ్యాయుడేనని జేసీ అన్నారు. ఆయన తన విజయానికి ఎంతో దోహదపడ్డారని గుర్తు చేసుకున్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 71 మందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప, సమగ్రశిక్ష ఏపీసీ దేవరాజ్, ఏడీలు శ్రీనివాసరావు, లాజర్, ఏపీ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ సుద్దలపల్లి గంగాధరప్ప, ఏపీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కాలే నాయక్, ఏపీ ట్రైబల్స్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యుడు సభావత్ సోమ్లానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమానంగా అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి, రెండింటినీ సమాంతరంగా నడిపిస్తున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కూటమి నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, పార్టీ పరిశీలకుడు కడప డీసీసీ బ్యాంకు చైర్మన్ జయప్రకాష్‌లతో కలిసి సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని, సూపర్‌సిక్స్ పథకాలను సూపర్‌హిట్‌గా మార్చి ప్రజలకు అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ అధినేత జగన్ ఐదేళ్ల పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసింది శూన్యం అన్నారు. మడకశిరకు రూ. 1200 కోట్ల పెట్టుబడితో మరో భారీ పరిశ్రమ రాబోతోందన్నారు. ఇప్పటికే డిఫెన్స్ పరిశ్రమ, సోలార్ ప్రాజెక్టులు సైతం మడకశిరలో రాబోతున్నట్లు తెలిపారు. త్వరలో హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువును నీటితో నింపుతామని వెల్లడించారు. వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. ఈనెల 10న అనంతపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారని, పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మళ్లీ.. నేల చూపులు..!



● వారం రోజులుగా తగ్గుముఖం పట్టిన టమోటా ధరలు

● దారుణంగా పడిపోతున్న వైనం

● ఆందోళన చెందుతున్న అన్నదాతలు

(వివరాలు 6లో...)



ధర్మవరం మండలంలో ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన కంది

ఈ పంట నమోదు ఎప్పుడో..?

నేటికీ 50శాతం కూడా పూర్తికాని వైనం

» ఈనెలాఖరు వరకే నమోదుకు అవకాశం

» వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం

» గడువు ముగుస్తోందని రైతుల ఆందోళన

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఈపంట(క్రాప్ బుకింగ్) నమోదు నత్తనడకన సాగుతోంది. ఇప్పటికి జిల్లాలో 50శాతం కూడా నమోదు కాని పరిస్థితి. ఈ పంట నమోదులో కిందిస్థాయి సిబ్బంది నుంచి మండల, డివిజన్‌స్థాయి అధికారులు వరకు నిర్లక్ష్యంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు టెలికాన్ఫరెన్స్‌లో ఈ పంట నమోదు నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నెలాఖరు వరకే ఈక్రాప్ బుకింగ్‌కు ఆఖరి గడువు ఉండటంతో ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు కోల్పోతామేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 25శాతమే పంటనమోదు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 25శాతమే పంట నమోదు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జూలై నుంచే పంటనమోదు కార్యక్రమంపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. అప్పట్లో గ్రామసిబ్బంది పంటనమోదు కార్యక్రమం మొదలుపెట్టామని వెంటనే రైతులంతా ఈ పంట నమోదు దరఖాస్తుతో పాటు పాసుపుస్తకాన్ని, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాను జిరాక్స్‌లు ఇవ్వాలని సూచించారు. అయితే ఇప్పటివరకు ఏ గ్రామంలో కూడా పొలంలోకి వెళ్లి పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టలేదు. జిరాక్స్‌లు తీసుకున్నారు సరే.. మరి పొలాల్లోకి వచ్చి, ఎప్పుడు ఈ క్రాప్ బుకింగ్ చేస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.

పర్యవేక్షణ ఏదీ...?

పంటనమోదు కార్యక్రమాన్ని నిత్యం పర్యవేక్షణ చేసి ఎంతమేర చేశారని, ఇంకా ఎన్ని ఎకరాలు చేయాలో క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన మండల, డివిజన్ స్థాయి వ్యవసాయాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. వీరు కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉండరు. అదేమంటే ఫీల్డ్‌లో ఉన్నామని సమాధానం చెబుతారు. కానీ అక్కడ కూడా ఉండరు. ఇందుకు ఈక్రాప్ బుకింగ్ తీరే నిదర్శనం. కొందరు అధికారులు ఫీల్డ్‌లో ఫొటోలు తీయించుకుని వారిపై అధికారులకు వాటిని పంపించి తిరిగి వచ్చేస్తున్నట్లు సమాచారం. దీంతో పంట నమోదు కార్యక్రమం నత్తనడకన సాగుతోంది.

సాగు చేయని భూమిని కూడా..

ప్రతి ఏడాది రైతులు సాగుచేసిన పంటలను మాత్రమే ఈ పంటనమోదు చేసేవాళ్లు. ఈ ఏడాది పంటసాగుచేయని భూములను కూడా ఈ పంట నమోదు యాప్‌లో ఆ భూమి సర్వేనెంబర్‌ను ఎంటర్ చేసి ఆ భూమి పైకి వెళ్లి ఫొటోలు అప్‌లోడ్ చేయాలనే ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏయే గ్రామాల్లో ఎన్ని ఎకరాలు సాగుచేశారో, ఎన్నిఎకరాలు బీళ్లుగా ఉన్నాయో పకడ్బందీగా సమాచారం కోసం ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. కాగా రీసర్వేలో జాయింట్ ఎల్‌పీఎంతో ఉన్న భూములు, అసైన్‌మెంట్ భూములు వివరాలు ఈ పంట నమోదు యాప్‌లో జనరేట్ కాకపోవడంతో ఆ రైతుల భూములు ఈపంట నమోదు యాప్‌లో కనిపించలేదు. దీంతో ఆ రైతులంతా నష్టపోయే అవకాశం ఉంది.

సర్వర్‌తో తంటాలు

ఈ పంటనమోదు చేయడంలో సిబ్బంది సర్వర్‌సమస్యతో తంటాలు పడుతున్నట్లు సమాచారం. రైతులు పొలాల వద్దనే ఈ పంట నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే కొండగుట్ట ప్రాంతాలు, అటవీప్రాంతాల సమీపంలో సర్వర్ సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు సిబ్బంది పేర్కొంటున్నారు. రైతులు రోజు పొలాల వద్దకు వెళ్లుతూ సర్వర్ రాలేదని తెలపడంతో తిరిగి వెనక్కి వస్తున్నట్లు సమాచారం.

వేగంగా పూర్తి చేస్తాం

జిల్లాలో ఈ పంటనమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మండల, గ్రామస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. ఈనెలాఖరు వరకు గడువు ఉంది. సాఫ్ట్‌వేర్, సర్వర్ సమస్యతో అలస్యమైంది. ప్రస్తుతం ఎరువుల పంపిణీని గ్రామస్థాయి సిబ్బంది చూసుకుంటుండటంతో ఆలస్యమౌవుతోంది. రైతులు ఏపంట సాగుచేసింటే ఆ పంటనే ఈ పంటలో నమోదు చేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాం. త్వరతగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

- రామునాయక్, జిల్లావ్యవసాయాధికారి, శ్రీసత్యసాయి జిల్లా


ధర్మవరం పరిధిలో సాగుచేసిన వేరుశనగ పంట

జిల్లాలో ఈనెల 4లోపు మండలాల వారీగా జరిగిన పంటనమోదు వివరాలు

మండలం	మొత్తం ఎకరాలు	ఇప్పటివరకు చేసిన ఎకరాలు
1.తాడిమర్రి	24725	4196
2.తలుపుల	41868	1714
3.నల్లచెరువు	24050	1573
4.బత్తలపల్లి	40370	9260
5.కదిరి	31243	2000
6.చెన్నేకొత్తపల్లి	50183	6993
7.నల్లమాడ	38499	2688
8.సోమందేపల్లి	29914	2990
9.పరిగి	26252	2099
10.బుక్కపట్నం	27862	3870
11.అమడగూరు	28387	1842
12.ముదిగుబ్బ	68904	6554
13.రొద్దం	68904	8605
14.రామగిరి	54938	7851
15.కనగానపల్లి	64435	10491
16.ధర్మవరం	62253	12185
17.మడకశిర	58084	6783
18.ఓబుళ దేవరచెరువు	33386	1385
19.హిందూపురం	26018	2326
20.గాండ్లపెంట	24648	1977
21.గోరంట్ల	50504	5562
22.కొత్తచెరువు	35309	3799
23.చిలమత్తూరు	31986	2593
24.తనకల్లు	52395	2634
25.గుడిబండ	39391	5532
26.పుట్టపర్తి	35059	2765
27.పెనుకొండ	41339	3699
28.రొళ్ల	27735	5390
29.నంబుల పూలకుంట	32318	2441
30.లేపాక్షి	28731	2791
31.అమరాపురం	46103	7526
32.అగళి	22187	3947
జిల్లామొత్తం	1267532 లక్షల ఎకరాలు	146061 ఎకరాలు

రాయల స్ఫూర్తితో చంద్రబాబు పాలన

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

● గోరంట్లలో రాయల విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ


రాయల విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయలసీమను రతనాల సీమగా మార్చిన ఘనత శ్రీకృష్ణదేవరాయలదని, ఆయన స్ఫూర్తితో సీఎం చంద్రబాబు సమర్థపాలన సాగిస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. గోరంట్ల బస్టాండ్ కూడలిలో శ్రీకృష్ణదేవరాల విగ్రహ ఏర్పాటుకు ఆమె శుక్రవారం భూమి పూజ చేశారు. తన తండ్రి పేరిట, కాపుల కోరిక మేరకు రాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండటం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. రాయలవారు ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు రాత్రి సమయంలో మారువేషంలో వెళ్లేవారని అన్నారు. చెరువులు, కుంటలు ఏర్పాటు చేయించి, ప్రజలకు తాగు, సాగునీటి సౌకర్యం కల్పించారని అన్నారు. రాయలవారి స్ఫూర్తితోనే చంద్రబాబు రాష్ట్రమంతటా పర్యటిస్తున్నారని, రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని అన్నారు. పెనుకొండలో శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. కొండపై లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో లేపాక్షి ఉత్సవాలను నిర్వహిస్తామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గోరంట్ల మండలంలోని మల్లాపల్లి సచివాలయం వద్ద కాపు భవనం నిర్మాణానికి 50 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, ఉత్తర్వుల కాపీని కాపులకు మంత్రి అందచేశారు. కాపు భవన్ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ నెల 10న అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వస్తున్నారని, నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంత్రిని కలిశారు. తమకు ఉద్యోగోన్నతి కల్పించినందుకు ధన్యావాదులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు సోముశేఖర్, పత్తి చంద్రశేఖర్, వెంకటరమణ, బాలక్రిష్ణ చౌదరి, లక్ష్మీనారాయణ, సంతోష్, కొత్తపల్లి నరసింహులు, నిమ్మల విద్యాధరణి, నాగేనాయక్, నిమ్మల శ్రీధర్, బలిజ సంఘం నాయకులు వేణుగోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సూపర్ హిట్ పనులు

● సభాస్థలిని పరిశీలించిన మంత్రి కొల్లు


సభా స్థలం వద్ద ప్రజా ప్రతినిధులు, నాయకులతో మంత్రి కొల్లు రవీంద్ర (వివరాలు 6లో....)

సాయి సన్నిధిలో ఓనం వేడుకలు

● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు




నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సన్నిధిలో కేరళ భక్తులు ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. చివరి రోజు శుక్రవారం సాయికుల్వంత్ మందిరంలో సంగీత, నృత్య ప్రదర్శనలతో అలరించారు. అంతకు మునుపు సత్యసాయి మహా సమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఓనం పాటల కచేరీని నిర్వహించారు. మాలప్పురం బాల వికాస్ చిన్నారులు 'పవిత్రాణాయ భక్తానాం' పేరిట నృత్య రూపకాన్ని, పాండురంగ చరిత్రలోని ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

ప్రవక్త అడుగుజాడల్లో నడుద్దాం

● ముస్లింలకు మత పెద్దల పిలుపు

● ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

హిందూపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడుద్దామని మత పెద్దలు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. హిందూపురంలో మక్కా, మదీనా నమూనాలను ప్రదర్శిస్తూ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పాత ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ, శాంతి, సహనంతో జీవించాలని ప్రవక్త బోధించారని మత పెద్దలు అన్నారు. ఆయన సందేశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో అహేలే సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు మహబూబ్ దౌలా, అబ్దుల్ రెహమాన్, ఆర్ఎంఎస్ షఫీ, రఫీక్ సేట్, సాదిక్ వలి, ఖాజీ అల్లా బకాష్, షాబుద్దీన్, మహ్మద్ బాబా ఫక్రుద్దీన్, డైమండ్ బాబా, అమీన్, కింగ్ షఫీ, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.


హిందూపురంలో ముస్లింల ప్రదర్శన

ఎరువుల దుకాణాలపై నిఘా వేయండి

● అధికారులకు జేసీ అభిషేక్ కుమార్ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు ఎరువుల దుకాణాలపై నిఘా ఉంచాలని, ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ అభిషేక్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో యూరియా, ఎరువులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రతి ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద ఓ వీఆర్‌ఓ, వీఆర్‌ఏను ఉంచాలని సూచించారు. సహకార సంఘాల వద్ద యూరియా నిల్వలు, అవసరాలను గుర్తించి.. తగినంత సరఫరా చేయాలని ఆదేశించారు. రైతులు క్యూలో రాత్రివరకూ వేచిచూడాల్సిన పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్డీఓ, వ్యవసాయశాఖ అధికారులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు నిఘా వేసి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ ఇన్‌చార్జి అధికారి రామునాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గీత, పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి

- ముస్లిం మత పెద్దలు
- భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రవక్త బోధనలను అనుసరించి సమాజ శ్రేయస్సుకు ప్రతి ముస్లిం పాటు పడాలని మతపెద్దలు పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి మసీదు, మదరసా, దర్గాల నుంచి ముస్లింలు జెండాలు చేతబూని ర్యాలీలు నిర్వహించా రు. నగరపాలకసంస్థ మేయర్ వసీం, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి, గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీలు ముస్లింలతో కలిసి శాంతిర్యాలీలు చేపట్టారు. పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దర్గాలు, మసీదులలో మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశ దర్శనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో రెండో రోడ్డులోని బహవుద్దీన్ మసీద్, పాతూరులోని మాసు మాబీ దర్గా, ఆసార్ దర్గా తదితర ప్రాంతాల్లో పవిత్ర కేశ దర్శనాన్ని నిర్వహించారు. మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో భాగంగా నగర ప్రధాన వీధుల్లో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలకు జనసేన ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ భవానీ రవికుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు.



కార్లపై మినార్‌లను ఊరేగిస్తున్న ముస్లింలు




గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జనసేన నాయకుడు రవి కుమార్



శాంతిర్యాలీలో పాల్గొన్న మేయర్ వసీం, కేఎం షకీల్ షఫీ, దాదాగాంధీ తదితరులు

కదిలించిన అక్షరం

వేణుగోపాల్ నగర్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కొత్తచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సక్సెస్ మీట్ తరువాత మిగిలిన సమస్యల పరిష్కారం వేగవంతమైంది. పట్టణంలోని వేణుగోపాల్ నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ నెల 3వ తేదీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సక్సెస్ మీట్ జరిగింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు హాజరయ్యారు. విద్యుత్ స్తంభాలను కాలనీకి చేర్చారని, ఇంకా పాతలేదని ఆ సమావేశంలో స్థానికులు కుళ్లాయప్ప, షాహీదా తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎల్1, ఎల్2, ఎల్3 కాలనీలలో సిద్ధంగా ఉంచిన 50 విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులు శుక్రవారం వీధుల్లో పాతడం ప్రారంభించారు. కాలనీ ప్రజలు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, పార్టీ నాయకురాలు తులసి, విద్యుత్ శాఖ ఏఈ వెంటేశ్ నాయక్, కాంట్రాక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



వేణుగోపాల్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు నాటుతున్న సిబ్బంది

అక్రమార్కులకు అగ్రిగోల్డ్

- సీఐడీ అటాచ్‌లో అగ్రిగోల్డ్ భూములు
- విలువైన భూముల ఆక్రమణకు యత్నం
- నకిలీ పత్రాలను సృష్టిస్తున్న కబ్జాదారులు



అగ్రిగోల్డ్ భూముల చుట్టు ఉన్న కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేసిన ఆక్రమణదారులు

కూడేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం- బళ్లారి ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న అగ్రిగోల్డ్ భూములు కాజేసేందుకు కొందరు కేటుగాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ భూముల విలువ ఎకరం రూ. కోటికి పైగా ఉండటంతో దోచేయడానికి యత్నిస్తున్నారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న ఈ భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారా? లేక నకిలీ పత్రాలను సృష్టించి కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారో అంతు చిక్కని రహస్యంగా మారింది.

మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలో దాదాపు 252 ఎకరాలు అగ్రిగోల్డ్ సంస్థ భూములున్నాయి. వైసీపీ పాలనలో కొందరు ప్లాట్లు కొన్నట్లు పత్రాలను సృష్టించుకోవడం, ప్లాట్లను శుభ్రం చేయడం, బాధితులు, సీపీఐ నాయకులు ఆందోళనలతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. అగ్రిగోల్డ్ వెంచర్‌లో విలువైన సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లినా ఎవరు పట్టించుకోలేదు. గత ఏడాది నగరానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు అర ఎకరం భూములు కొన్నానని, ఆక్రమించుకోవడానికి శుభ్రం చేస్తుండగా బాధితులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా ఆక్రణదారుడు వెనక్కి తగ్గారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. వారం కిందట రాజగోపాల్‌రెడ్డి, సాకే అభిజ్ఞ అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న వాచ్‌మన్ గదితోపాటు కాంపౌండ్ వాల్ రాత్రి సమయంలో ధ్వంసం చేసి ప్లాట్‌ను శుభ్రం చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోలేదు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర గార్డెన్ డెవలపర్ పేరుతో 22 ఎకరాలు 2014లోనే రాజగోపాల్ రెడ్డి కొనుగోలు చేశారని, భూమి మొత్తం సీఐడీ అటాచ్‌లో ఉందని, 2023లో అభిజ్ఞ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నట్లు పత్రాలను పుట్టించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆక్రమణదారులు రాకుండా చర్యలు

అగ్రిగోల్డ్ భూముల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. వెంచర్‌లో ఉన్న భవనం కూల్చివేసిన వారి నుంచి వివరాలను సేకరిస్తున్నాం. సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ప్లాట్లు కోర్టు ఆదేశాలుంటే పరిశీలిస్తాం. అంత వరకు ఎవరు ఆ భూముల్లోకి వెళ్లకూడదు.

- మహబూబ్‌బాషా, తహసీల్దారు కూడేరు

మళ్లీ.. నేల చూపులు..!

- వారంరోజులుగా తగ్గుముఖం పట్టిన టమోటా ధరలు
- దారుణంగా పడిపోతున్న వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



కక్కలపల్లి మార్కెట్‌లోని మండీలకు వచ్చిన టమోటాలు

అనంతపురం రూరల్/ఆత్మకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు నేలచూపులు చూస్తున్నాయి. కొన్నాళ్లుగా నిలకడగా సాగుతున్న ధరలు.. పతనస్థాయికి చేరుకుంటున్నా యి. వారం రోజులుగా ధరలు తగ్గుతున్నాయి. కొన్నేళ్లుగా టమోటా ధరలు రైతులకు చేదు అనుభవాలనే మిగిల్చాయి. నిలకడలేని ధరలతో దెబ్బతింటూనే ఉన్నారు. ధర పెరిగింది అనుకునేలోపు.. మళ్లీ తగ్గిపోవడంతో చాలా వరకు న ష్టాలనే చవిచూశారు. గిట్టుబాటు ధర కోసం రో డ్డెక్కిన సందర్భాలు లేకపోలేదు. గతేడాది ఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నష్టాలను దిగమింగుకుని ఈ ఏటా రైతులు పంట పెట్టారు. ఈ సారి సాగు విస్తీర్ణం తగ్గినట్లు సంబంధింత వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో సీజన్ ప్రారంభం నుంచి ధరలు నిలకడగా ఉం టున్నాయి. రెండు, మూడు నెలలపాటు ధరలు స్థిరంగానే పలికాయి. జిల్లాలోని టమోటా మార్కెట్ల నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో స్థానికంగా కాయలు మార్కెట్‌కు రాకపోవడం రైతులకు కలిసొచ్చింది. నిత్యం నష్టాలను చవిచూసిన రైతులు కొంత ఊరటనిచ్చాయి. ప్రస్తుతం పరిస్థితులు మళ్లీ మొదటికి తెస్తున్నాయన్నా భయం సంబంధిత వర్గాల్లో నెలకొంటున్నాయి. కొన్ని రోజులుగా ధరల్లో తగ్గుదల కనిపిస్తోంది. వారం రోజులుగా పరిస్థితి మరింతగా దిగజారుతోంది. ధరలు పతనస్థాయికి తీసుకెళ్తున్నాయి. దీంతో సంబంధిత వర్గాల్లో ఆందోళనలు రేగుతున్నాయి.

ప్రారంభంలో బాగున్నా..

టమోటా ధరలు సీజన్ ప్రారంభంలో బాగా పలికాయి. సీజన్ ప్రారంభం నుంచి కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మేలిరకం కాయలు కిలో రూ.30 నుంచి రూ.35 మధ్య పలుకుతున్నాయి. గత నెలలో రూ.40 నుంచి రూ.47 వరకు పలికాయి. అంటే పదిహేను కిలోల బాక్సు రూ.600 నుంచి రూ.700 మధ్య అమ్ముడుపోయింది. సరాసరి గత రెండు, మూడు నెలలు 15కిలోల బాక్సు రూ.350 నుంచి రూ.400 పలికినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో రైతులకు లాభాలను తెచ్చిపెట్టాయి. గత వారం రోజులుగా పరిస్థితులు మారిపోయాయి. కిలో రూ.25 లోపే పలుకుతున్నాయి. గురువారం ధరలు మరింత దిగజారిపోయాయి. కిలో గరిష్ఠ ధర రూ.15తో అమ్ముడుపోయాయి. దీంతో ధరను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గుతున్న ఎగుమతులు..

జిల్లాలో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఎగుమతులు మందగించాయంటూ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్రభావం ప్రస్తుత ధరలపై పడుతోందంటున్నారు. జిల్లాలోని మార్కెట్ల నుంచి పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణతోపాటు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు టమోటా ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఆయా మార్కెట్లకు స్థానికంగా కాయలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎగుమతులు లేక ధరలు తగ్గుతున్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో జిల్లాలోని మార్కెట్లలో కాయలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రైతులు అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన కొందరు వ్యాపారులు సొంత ప్రాంతాలకు వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. అమ్మకాలు తగ్గిపోవడంతో రెండు, మూడు బండ్లు లోడుచేసే వ్యాపారులు ఒకటికి చాలు అనేస్తున్నట్లు సమాచారం.

గత వారం రోజులుగా కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరల వివరాలు...

తేదీ	మార్కెట్‌కు వచ్చిన టమోటా (టన్నుల్లో..)	గరిష్ఠ ధర (కిలో రూ.)	సరాసరి ధర (కిలో రూ.)	కనిష్ఠ ధర (కిలో రూ.)
ఆగస్టు 29	3,225	23	19	14
ఆగస్టు 30	3,225	23	19	14
ఆగస్టు 31	3,000	25	19	14
సెప్టెంబరు 1	2,850	26	19	14
సెప్టెంబరు 2	3,000	23	18	14
సెప్టెంబరు 3	3,375	21	17	14
సెప్టెంబరు 4	3,075	15	13	10

కూలీల ఖర్చులు కూడా వచ్చేలా లేవు



రెండు విడతల్లో టమోటా సాగు చేశా. తొలి విడతలో ఎకరంలో పెట్టా. రెండవ విడతలో ఒకటిన్నర ఎకరాల్లో సాగు చేశా. పెట్టుబడులు భారీగానే వచ్చాయి. మొదటి కోతలో 60బాక్సులు అయ్యాయి. బాక్సు రూ.280, రెండో కోతలో వంద బాక్సులు రూ.200తో అమ్ముడుపోయాయి. మూడో కోత కోసి 180 బాక్సులు తీసుకొచ్చా. బాక్సు రూ.120తో అమ్ముడుపోయింది. ఖర్చులు, బాడుగలు, కమీషన్ ఇతరత్రా రూపాల్లో వచ్చిన ధరలో సగం మార్కెట్‌లోనే పోతోంది. ఈ ధరతో పంటకోసిన కూలీల ఖర్చులు కూడా దక్కేలా లేవు.

- రామన్న, దేవిరెడ్డిపల్లి, రాయదుర్గం మండలం

పెట్టుబడులైనా దక్కుతాయో.. లేదో..?



మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశా. పెట్టుబడుల రూపంలో రూ.2లక్షలకుపైగానే ఖర్చు అయింది. ఇప్పటి వరకు ఐదు కోతలు కోశా. కొంత వరకు పెట్టుబడి వచ్చింది. పదిరోజులుగా ధరలు తగ్గిపోతున్నాయి. ధరల తగ్గుదల చూస్తుంటే భయమేస్తోంది. కనీసం పెట్టుబడులైనా దక్కుతాయో.. లేదో.. చూడాలి.

- ఎర్రిస్వామి, ఆత్మకూరు

మరుభూమిని సైతం..!

- ఆక్రమణల్లో ఎస్సీల శ్మశాన వాటిక
- ఇబ్బంది పడుతున్న మర్తాడు ఎస్సీలు



మర్తాడులో ఆక్రమణకు గురవుతున్న ఎస్సీల శ్మశాన వాటిక

గార్లదిన్నె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధరలు పెరగడంతో కబ్జాదారులు మరుభూమిని సైతం వదలకుండా ఆక్రమిస్తున్నారు. మండలంలోని మర్తాడు గ్రామంలో ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమిస్తున్నారని గ్రామ ఎస్సీలు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 500 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి. గ్రామానికి సమీపంలో రెండెకరాల స్థలంలో వీరికి శ్మశాన వాటికను ప్రభుత్వం కేటాయించింది. అయితే శ్మశాన వాటికకు దగ్గరల్లో ఉండే వారు కాలక్రమేణ ఈ స్థలం ఆక్రమించుకుంటూ ఇళ్లు నిర్మించుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపి స్తున్నారు. ఎస్సీల శ్మశాన వాటికకు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే శ్మశాన వాటికను పూర్తిగా ఆక్రమించుకుంటారని ఆందోళన చెందుతున్నారు.

భద్రత కల్పించాలి : పెద్దన్న మర్తాడు



గ్రామంలో ఉన్న ఎస్సీలకు రెండెకరాల్లో శ్మశానవాటికను ప్రభుత్వం కేటాయించింది. గ్రామంలో ఎస్సీలు మృతి చెందితే అందులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం. అయితే శ్మశాన వాటిక సమీపంలో ఉన్న వారు కొందరు శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్నారు. అధికారులు స్పందించి ఎస్సీల శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

ఫిర్యాదు చేసిన స్పందించలేదు



ఎస్సీల శ్మశాన వాటిక ఆక్రమణకు గురి అవుతోందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ఇటీవల మర్తాడు ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా. సర్వే చేయించి ఉపాధి హామీ ద్వారా శ్మశాన వాటికకు కంచె వేయిస్తామని తహసీల్దార్ చెప్పారు. సర్వే చేయిస్తే ఆర్డీటీ గ్రామ స్వరాజ్ నిధి ద్వారా శ్మశాన వాటికకు కంచె వేయించుకుంటాం.

- బూడిద కిష్ట, మర్తాడు

చురుగ్గా సూపర్ హిట్ పనులు

- సభాస్థలిని పరిశీలించిన మంత్రి కొల్లు
- హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభ నిర్వహణకు అనంతపురంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జీఎంఆర్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆప్కాబ్ చైర్మన్ గండి వీరాంజినేయులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులతో కలసి సభాస్థలిని పరిశీలించారు. మ్యాప్ తెప్పించుకుని బహిరంగ సభ, హెలీ ప్యాడ్, పార్కింగ్ స్థలాల వివరాలను తెలుసుకున్నారు. సభ విజయవంతమయ్యేలా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రామలింగారెడ్డి, గాజుల ఆదెన్న, నాగరాజు, నాయకులు గంగారామ్, సుధాకర్ యాదవ్, లక్ష్మీనరసింహ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తదితరులు

హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు

అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిలోని టాటా మోటార్స్ ఎదురుగా ఉన్న స్థలంలో రెండు హెలీప్యాడ్‌ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పనులను ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న రేకుల షెడ్లు తొలగించాలని, మరో మట్టి లేయర్ వేసి, రోలింగ్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, ఈఈ రాజగోపాల్, డీఈ కాటమయ్య, తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.



బహిరంగ సభ వేదిక పనులు చేస్తున్న కార్మికులు

బాలికపై అత్యాచారయత్నం

హిందూపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఓ కాలనీలో 13 ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనురదల్ల ఏడేళ్ల క్రితం ఓ వివాహితను తీసుకొచ్చి కలిసి ఉంటున్నాడు. ఆమె ఓ హోటల్‌లో పనిచేస్తుంటారు. ఇంట్లో లేని సమయం చూసి, ఆమె కూతురుపై అత్యాచారానికి యత్నించాడు. బాధిత బాలికను అనురదల్ల కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మరోమారు బాలికపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. భయపడిన బాలిక, కేకలు వేస్తూ బయటకి పరుగులు తీసింది. విషయాన్ని తల్లి వచ్చాక చెప్పింది. ఆమె హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నిందితుడు పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

బొట్టుపెట్టి పిలవండి

- ఇంటింటికీ వెళ్లి ఆడపడుచులను ఆహ్వానించండి
- టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- వైసీపీ ఫేక్ ప్రచారం తిప్పికొట్టండి
- ఆప్కాబ్ చైర్మన్ గండి వీరాంజనేయులు
- బహిరంగ సభ విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే దగ్గుపాటి



పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'అనంతపురం అర్బన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లండి. ఆడపడుచులకు బొట్టుపెట్టి, సూపర్‌హిట్ సభకు ఆహ్వానించండి. అనంతపురం అర్బన్ నియోజక వర్గం నుంచే లక్ష మంది కదిలి రావాలి' అంటూ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ శ్రేణులకు సూచించారు. నగరంలోని మారుతీనగర్ సాయిబాబా గుడి కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం అర్బన్ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అందుకే ఎన్నికల్లో కూటమి పార్టీలకు 175 స్థానాలకు 164 కట్టబెట్టారన్నారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పింఛన్‌ను రూ.4వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల ఫించన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, బెడ్‌పై లేవలేని స్థితిలో ఉన్న వాళ్లకు రూ. 15 వేలు, దీర్ఘకాలిక జబ్బులతో ఉన్న వాళ్లకు రూ.10 వేలు ఇచ్చామన్నారు. ఏడాది కాలంలోనే పింఛన్ల కోసం రూ.35 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవన, తల్లికి వందనం 16,400 డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇవన్నీ కూటమి ప్రభుత్వమే అందించిందని తెలిపారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలిపేందుకు అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ గత 44 ఏళ్లలో తొలిసారి అనంతపురంలో భారీ బహిరంగ సభ జరగబోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనపై పెట్టిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలన్నారు. 3.5 లక్షల మంది సభకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. టీడీపీ జోన్-5 ఇన్‌చార్జ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు కష్టపడి కూటమిని గెలిపించారని, ఇప్పుడు ఈ విజయోత్సవ సభను సైతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్బన్ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11 సీట్లు ఇచ్చినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. తిరుమల పవిత్రతను సైతం దెబ్బతియ్యాలని చూశాడని, ఆఖరికి టికెట్లు కూడా అమ్ముకున్నారంటూ మండిపడ్డారు. 10న జరిగే సభను విజయవంతం చేయాలని సూచించారు. అంతకు ముందు ఆప్కాబ్ చైర్మన్ గండి వీరాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ నాయకుల ఫేక్ ప్రచారాలను టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ అనంతపురం ఉమ్మడి జిల్లా టీడీపీకి కంచుకోట అన్నారు. కార్యక్రమంలో లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, జేయల్ మురళి, స్వామిదాస్, మదమంచి స్వరూప, డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, బొమ్మినేని శివ, పరమేశ్వర్, కొండన్న, నాయకులు సుధాకర్‌నాయుడు, చేపల హరి, సుధాకర్ యాదవ్, సింగవరం రవి, నెట్టెం బాలకృష్ణ, తేజస్విని, హరి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు


మహమ్మద్ ఇసాక్


జయచంద్ర


యాదవ అరుణ


ఉప్పరపల్లి శైలజ


బండి శ్రీనివాసులు


డాక్టర్ జీ కవిత


డాక్టర్ జీ ప్రభాకర్‌రావు


ప్రొఫెసర్ ఓం ప్రకాష్


ప్రొఫెసర్ శారద


ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి

ఉత్తమ గురువులకు సత్కారం

పురస్కారాలను అందజేసిన సీఎం చంద్రబాబు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యా బోధనలో విశేష కృషి చేస్తున్న గురువులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించారు. విజయవాడలో జరిగిన గురుపూజోత్సవంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శారద, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఓంప్రకాష్, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ బి. ఈశ్వర్‌రెడ్డి అవార్డులను అందుకున్నారు. కళ్యాణదుర్గం ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు శ్రీధర్, అనంతపురం గవర్నమెంట్ కాలేజీ అధ్యాపకుడు డాక్టర్ జి. ప్రభాకర్ రావు, బండ్లపల్లి జడ్పీ హైస్కూల్ టీచర్ మహమ్మద్ ఇసాక్, కోగిర జడ్పీ హైస్కూల్ టీచర్ జయచంద్ర, పామిడి ఏపీఎంఎస్ ప్రిన్సిపాల్ యాదవ అరుణ, ఆత్మకూరు జడ్పీ హైస్కూల్ టీచర్ ఉప్పరపల్లి శైలజ, అబ్బేదొడ్డి జడ్పీ హైస్కూల్ టీచర్ బండి శ్రీనివాసులు, శింగనమల ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కవిత అవార్డును సీఎం, విద్యాశాఖ మంత్రి నుంచి అందుకున్నారు.

నంది విగ్రహం చోరీ


చోరీకి గురైన విగ్రహం ఇదే..

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికోవెల గ్రామ శివారులో ఉన్న ఐదు శతాబ్దాల పురాతన శివాలయంలో నందివిగ్రహం చోరీకి గురైంది. గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి నందివిగ్రహాన్ని ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఉదయం శివాలయంలో పూజలకు వెళ్లిన భక్తులు గమనించి విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు. వారు అక్కడికి వెళ్లి పరిశీలించగా ఆలయ గర్భగుడికి ఎదురుగా ప్రతిష్ఠించిన ప్రధాన నంది విగ్రహాన్ని పెకలించడం గుర్తించారు. ఆస్థానంలో ఆలయంలోనే పక్కన ఉంచిన మరో చిన్న నంది విగ్రహాన్ని పెట్టి ప్రధాననంది విగ్రహాన్ని ఎత్తుకెళ్లినట్లు గమనించారు. గుప్తనిధుల కోసమే గుర్తుతెలియని దుండగులు ఆ పని చేసి ఉంటారనే అనుమానాలను వారు వ్యక్తం చేశారు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యార్థి అదృశ్యం

వజ్రకరూరు(ఉరవకొండ),సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి అదృశ్యమయ్యాడు. గుత్తి మండలం, బసినేపల్లి తండాకు చెందిన మహేష్ నాయక్ ఆ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి 10 గంటల నుంచి కనిపించకపోవడంతో ఉపాధ్యాయులు ఆ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. దీంతో శుక్రవారం ఆ విద్యార్థి తండ్రి రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముదిగుబ్బ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల సమీపంలో జరిగినట్లు ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి దాదాపు 55 సంవత్సరాల వయసు కలిగిన ఓ పురుషుడు ముదిగుబ్బ-చెన్నేకుంటపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జిల్లేడుబండ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి మృతి చెందాడన్నారు. చామన ఛాయ గలిగిన మృతదేహంపై మెరూన్ రంగు టీ-షర్టు, నీలం, ఎరుపు రంగు కల లుంగీ ఉన్నాయన్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8978656463, 9951325345 నంబర్లకు సమాచారం అందించాలని ధర్మవరం రైల్వే పోలీసులు కోరారు.

చెరువులో జారిపడి విద్యార్థి ...


మైలార్ (ఫైల్)

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో ఆడుకునేందుకు చెరువు వద్దకు వెళ్లి జారిపడి బాలుడు మైలార్(10) మృతి చెందిన సంఘటన మండలం ఆయతాపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో మనోజ్ స్నేహితులతో కలిసి మధ్యాహ్నం చెరువు సమీపంలో ఆడుకునేందుకు వెళ్లాడు. ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో కాలుజారి పడిపోయాడు. తోటి బాలురు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో ఉన్న బాలుడిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. గుమ్మఘట్ట మండలం ఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన జయమ్మ, మల్లయ్య దంపతుల పెద్ద కుమారుడు మైలార్. అయితే ఆయతాపల్లి గ్రామంలో అమ్మమ్మ మారక్క వద్ద ఉంటూ ఆ గ్రామంలోని పాఠశాలలో నాలుగో తరగతి చదువుకునేవాడు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతిచెందిన నిఖిల్ కుమార్

హిందూపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నానెప్ప నగర్‌కు చెందిన నిఖిల్ కుమార్(32) శుక్రవారం ఉదయం అనుమానాస్పదంగా మృతిచెందాడని టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. నిఖిల్ కుమార్ గురువారం వినాయక నిమజ్జనంలో పాల్గొన్నాడు. అతనితోపాటు మరో ఇద్దరు రహమత్‌పురంలోని ఓ ఏసీ గోదాము వద్దకు తెల్లవారు 3.30 గంటల సమయంలో వెళ్లి మద్యం సేవించినట్లు సీసీ ఫుటేజీలో కనిపించింది. తెల్లవారుజాము 4.40 గంటల వరకు వారు అక్కడే ఉన్నారు. ఆ తరువాత నిఖిల్ కుమార్ కిందకు పడిపోవడంతో వెంట వచ్చిన ఇద్దరు వెళ్లిపోవడం కనిపించింది. వీరు వేడుకల్లో ఎక్కువసేపు డీజే సౌండ్‌లో నృత్యం చేశారు. ఆ తరువాత మద్యం సేవించారు. అతని మృతికి కారణాలు ఏమిటో పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలుస్తుందని సీఐ అన్నారు. మృతునికి భార్య పావని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యానికి బానిసై.. ఆత్మహత్య

రాప్తాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యర్రగుంట గ్రామానికి చెందిన కొడిగ సంజీవయ్య(31) విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన మేరకు, సంజీవయ్య మద్యానికి బానిస అయ్యాడు. డబ్బు కోసం భార్య గౌతమిని వేధించేవాడు. దీంతో పెద్ద మనుషులు పలుమార్లు పంచాయితీ చేశారు. అలవాటు మానుకోవాలని మందిలించినా సంజీవయ్యలో మార్పు రాలేదు. మద్యం తాగేందుకు డబ్బు కావాలని భార్యను కొట్టేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఉన్న విషం తాగి బాత్‌రూమ్‌లో పడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 753 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.


ఇదేదో.. ఇంటి సామగ్రి వేసుకునే షెడ్డు అనుకుంటే పొరబాటే. చిలమత్తూరు మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. నాలుగేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేశారు. దాతలు నాలుగు షెడ్లు కట్టించారు. వాటిలోనే పాఠశాల నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే షెడ్లు కారుతుండడంతో మొత్తం నీరు చేరుతోంది. తరగతులు నిర్వహించలేని దుస్థితి దాపురిస్తోంది. గత ప్రభుత్వం నాడు-నేడు అంటూ ప్రగల్భాలు పలికింది. ఒక్క గది కూడా కట్టలేకపోయింది.


ఇది వెంకటాపురం ఉన్నత పాఠశాలలోని ఓ తరగతి గది. కాదు.. కాదు.. చిన్న షెడ్డు. ఇందులో ఏడు, ఎనిమిది తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక టీచరు మాత్రమే బోధించే అవకాశం ఉంది. ఏడో తరగతికి పాఠం చెబుతుంటే.. ఎనిమిదో తరగతి వారు ఖాళీగా కూర్చోవాల్సిందే. ఎనిమిదో తరగతి వారికి బోధిస్తుంటే.. ఏడో తరగతి విద్యార్థులు ఖాళీగా ఉండాల్సిందే.

చిన్న షెడ్లలో పెద్దబడి

- అప్‌గ్రేడ్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు నిల్
- వేధిస్తున్న తరగతి గదుల కొరత
- కంకర తేలిన మైదానంలో ప్రమాదాలు


అర్ధాంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలు

చిలమత్తూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని వీరాపురం పంచాయతీ వెంకటాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పురిటిలోనే పుట్టెడు సమస్యలను ఎదుర్కొంటోంది. గ్రామంలో ఏళ్లుగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను 2021లో అప్‌గ్రేడ్ చేశారు. పది వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రానికి వీరాపురం పంచాయతీలోని గ్రామాలు సుమారు 10 నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దాంతో ఆయా గ్రామాల్లో ఉన్న పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం చిలమత్తూరుకు రాలేక బడి మానేస్తున్నారు. వీరాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషించారు. వెంకటాపురం గ్రామంలో పాఠశాలను విస్తరించడానికి తగినంత స్థలం లేకపోవడంతో లక్ష్మీపురం-వెంకటాపురం గ్రామాల మధ్య సుమారు 7 ఎకరాల్లో పాఠశాలను ఏర్పాటుచేశారు. పాఠశాల అప్‌గ్రేడ్ అయినప్పటి నుంచి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కనీస సదుపాయాలు కరువవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 50 ఉన్న విద్యార్థుల సంఖ్య అప్‌గ్రేడ్ చేయగానే ఒక్కసారిగా 127కి పెరిగింది. ఉన్నత పాఠశాలగా మారడంతో ఆదెప్పల్లి, ఆదెప్పల్లి తండా, హుసేన్‌పురం, భూపసముద్రం, లక్ష్మీపురం, వెంకటాపురం, వీరాపురం, దాదిరెడ్డిపల్లి, దాదిరెడ్డిపల్లి తండా నుంచి విద్యార్థులు క్యూకట్టారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా పాఠశాలలో మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించట్లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పాఠశాల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.కోటి మంజూరు చేయడంతో పనులు చేపడుతున్నారు.

సదుపాయాలు కరువు

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయడంతో కొందరు దాతలు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. అవి కూడా నాలుగే ఉండడంతో మరో తరగతికి గది లేదు. షెడ్లు నాణ్యతగా లేకపోవడంతో వర్షం వస్తే కారి, నిండిపోతున్నాయి. ఆరుబయట పాఠాలు చెప్పలేక టీచర్లు.. ఒకే గదిలో రెండు తరగతులకు బోధిస్తున్నారు. ఆటస్థలం కరువైంది. పాఠశాల ఆవరణం పూర్తిగా వ్యవసాయ భూమి కావడంతో నేల మొత్తం కంకర రాళ్లతో ఉంది. దాంతో విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్, తాగునీరు వంటి కనీస సదుపాయాలు కూడా లేవు.

ఎమ్మెల్యే చేయూత

పాఠశాలలో మౌలిక సదుపాయాలు, తరగతి గదుల కొరతను ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. వెంటనే ఎమ్మెల్యే పీఏ వీరయ్యతో మాట్లాడి పాఠశాల అభివృద్ధికి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఆ మేరకు ఆయన నివేదిక ఇవ్వడంతో ఆగమేఘాల మీద పాఠశాలలో నూతన భవనాల నిర్మాణానికి సీఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేయించారు. దాంతో పాఠశాలకు మహర్దశ వచ్చినట్లయింది. భవనాల నిర్మాణం కూడా ప్రారంభించారు. ఆ పనులు కూడా నాలుగు నెలలుగా ఆగిపోవడం శోచనీయం.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

వెంకటాపురం పాఠశాల అభివృద్ధికి టీచర్లు పాటుపడుతున్నారు. మౌలిక సదుపాయాలను సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకుంటున్నారు. విద్యార్థులకు ఆటస్థలాన్ని చదును చేయించారు. మొక్కలు పెంచుతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న 11 మంది టీచర్లు సొంత డబ్బులు వెచ్చించి తరగతి గదిని నిర్మిస్తున్నారు.

ఆట స్థలం మొత్తం కంకర రాళ్లే



పాఠశాలకు ఆటస్థలం లేదు. పాఠశాల ముందు భాగంలో ఖాళీ స్థలం ఉన్నా.. అది కంకర రాళ్లతో నిండి ఉంది. దాంతో అడుగు పెట్టాలంటే ఇబ్బందిగా మారింది. దీంతో ఆటలకు దూరం అవుతున్నాం. ఆటస్థలాన్ని బాగుచేయాలి.

- బాలాజీ, విద్యార్థి

సదుపాయాల కొరత



పాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో చాలా సంతోషించాం. మరోచోట నిర్మించాల్సి రావడంతో తరగతి గదులు, మౌలిక సదుపాయాల కొరత తలెత్తింది. ఎమ్మెల్యే బాలకృష్ణకు సమస్యను విన్నవించగా.. పాఠశాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశారు. అనివార్య కారణాలతో భవనాల నిర్మాణం ఆగిపోయింది. ఇప్పుడు పిల్లలకు బోధన ఎలా చేయాలో అర్థం కావడం లేదు. గదుల కొరత కారణంగా పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు రావడం లేదు.

- జనార్దన్, పాఠశాల హెచ్ఎం, వెంకటాపురం

సోషలిజంతోనే సంపూర్ణ స్వాతంత్ర్యం

రాజ్యాంగం, లౌకికతత్వ పరిరక్షణే ఎర్ర జెండా లక్ష్యం

సీతారాం ఏచూరి వర్ధంతి సభలో రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సోషలిజంతోనే దేశానికి సంపూర్ణ ప్రజా స్వాతంత్ర్యం వస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. సమాజంలో దోపిడీ, వివక్ష, పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థలను రూపుమాపి, సమానత్వం, ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డను అందించేలా సోషలిస్టు దేశాన్ని స్థాపించుకున్నపుడే ప్రజలకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం వచ్చినట్లవుతుందని అన్నారు. సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో రాంభూపాల్ మాట్లాడారు. దేశంలో మతతత్వం, కార్పొరేట్, ప్రైవేటీకరణ, దోపిడీ వ్యవస్థల నిర్మూలనకు ఎర్ర జెండాను ఆయుధంగా చేసుకుని సీతారాం ఏచూరి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన తుదిశ్వాస వరకూ ప్రజల పక్షాన గొంతెత్తి పోరాడిన మహనీయుడని అన్నారు. ప్రస్తుతం దేశంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలు అమలు చేస్తూ.. రాజ్యాంగం, లౌకికతత్వాన్ని ఆటంకపరుస్తోందని విమర్శించారు. యువత భవిష్యత్తు అంధకారంగా తయారైందని అన్నారు. సాఫ్ట్‌వేర్ రంగం కుదేలై.. ఉద్యోగాలు లేక ఉపాధిని కోల్పోయి రోడ్డున పడుతున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ భ్రష్టు పట్టిపోయిందని అన్నారు. ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిబింబంగా నాడు ఎన్టీఆర్ నిలిచిన గొప్ప చరిత్ర రాష్ట్రానికి ఉందని అన్నారు. ట్రంప్ తన స్నేహితుడని గొప్పలు చెప్పుకునే మోదీ.. ఎర్రజెండా మోస్తున్న కమ్యూనిస్టులను చైనా కుక్కలని నాడు హేళన చేశారని, అదే మోదీ కమ్యూనిస్టు దేశాలైన చైనా, రష్యా అధ్యక్షులను కలిశారని, ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం కొనసాగిద్దామనే నూతన అధ్యాయం ఆరంభించారని అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా వారంరోజులపాటు వాడవాడలా నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప తెలిపారు. పాలకుల అస్తవ్యస్థ విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు మన్నీల రామాంజనేయులు, ముర్తుజా, వెంకటనారాయణ, వలి, ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, గోపాల్, జీవా, ఓబులేసు, లక్ష్మీనరసమ్మ, లక్ష్మీనారాయణ, రాజు, గఫూర్, వెంకట్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నేమకల్లు అంజన్న ఆలయం మూసివేత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 5, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేయనున్నట్లు ఆలయ అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అర్చకులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం సంప్రోక్షణ కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం సుప్రభాత, ప్రాత:కాల పూజలు నిర్వహించి స్వామి వారి దర్శనం కల్పిస్తామన్నారు.

'వైకుంఠం'కు వైరల్ ఫీవర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. కుటుంబికులు, టీడీపీ నాయకుల సమాచారం మేరకు మూడురోజుల కిందట ఆయనకు జ్వరం వచ్చింది. వ్యక్తిగత పనిమీద బెంగళూరుకు వెళ్లడంతో అక్కడి చల్లని వాతావరణం కారణంగా ఆయనకు మరింత ఇన్‌ఫెక్షన్ సోకింది. జలుబు, గొంతు నొప్పి, దగ్గు, జ్వరంతో తీవ్రంగా బాధపడుతున్నట్లు సమాచారం. వైరల్ ఫీవర్ నేపథ్యంలో బయట తిరగవద్దని వైద్యుల సూచనల మేరకు ఆయన ఇంట్లోనే విశ్రాంతి పొందుతున్నట్లు తెలిసింది.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, కొత్తచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఈ నెల 30వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగా పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలని సూచించారు. ఈ పరీక్ష రాయడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలలో ఈ ఏడాది 8వ తరగతి చదువుతూ, ఏడాదికి రూ.3.50 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాల విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుము ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలు ఈ ఏడాది డిసెంబరు 7వ తేదీన జరుగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సూచించారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు చొప్పున ఐదేళ్లపాటు ఉపకార వేతనం అందిస్తుందని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లాజర్ తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పాఠశాల డీఐఎస్ఈ నంబరుతో లాగిన్ కావాలని, ఆధార్ కార్డు ఆధారంగా వివరాలను నమోదు చేయాలని సూచించారు.

వెలుగు జ్యోతులు అధ్యాపకులు

జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు


సర్వేపల్లి విగ్రహం వద్ద వీసీ, రిజిస్ట్రార్ తదితరుల నివాళి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు దేశానికి వెలుగు చూపే జ్యోతులని, విద్యార్థులను బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో వీరే కీలక పాత్ర పోషిస్తున్నారని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు అన్నారు. వర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో సర్వేపల్లి చిత్రపటానికి వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీ దేవన్న తదితరులు నివాళులు అర్పించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వం వికసించడానికి, విద్యాపరమైన విజయాలకు క్రమశిక్షణయుతమైన బోధన కీలకమైందన్నారు. ఈక్రమశిక్షణ బోధించి విద్యార్థులను తీర్చి దిద్దడంలో టీచర్ల పాత్ర అమోఘమైందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాలిఘోర్పడే, నాగప్రసాద్‌నాయుడు, కిరణ్మయి, సురేష్‌బాబు, దుర్గాప్రసాద్, శోభీబిందు, సుజాత, శివకుమార్, ఏటిపిఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు. ఓటీపీఆర్ఐలో కూడా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ సంచాలకులు జీవీ సుబ్బారెడ్డి తదితరులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపినాథ్, డిప్యూటి రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నల్లమాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన రంగస్వామినాయుడు(56) శుక్రవారం తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్థులు తెలిపారు. ఇదే ప్రమాదంలో మృతుడి భార్య ఆదిలక్ష్మి, ఎన్ క్రిష్టప్ప తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. రంగస్వామినాయుడు, క్రిష్టప్ప ఇద్దరు కలిసి గత ఏడేళ్లుగా మామిడి, జామ తోటలు కొనుగోలు చేసి, పండ్ల వ్యాపారం చేస్తున్నారు. మృతుడు రంగస్వామినాయుడు కుమారుడి వివాహం నిమిత్తం పది రోజుల కిందట స్వగ్రామానికి వెళ్లారు. పెళ్లి కార్యక్రమం ముగించుకుని, గురువారం రాత్రి రంగస్వామినాయుడు, ఆదిలక్ష్మి, క్రిష్టప్ప రైలులో తెలంగాణాకు వెళ్లారు. రైల్వే స్టేషన్ నుంచి తాము నివాసమున్న ప్రాంతానికి వెళ్లడానికి కడతాల్ బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా ప్రమాదవశాత్తు కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో రంగస్వామినాయుడు దూరంగా ఎగిరిపడ్డాడు. మిగిలిన ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఆదిలక్ష్మిని, క్రిష్టప్పను సమీపంలోని ఆసుపత్రికి తరలించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి రంగస్వామినాయుడును ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

టమోటా కిలో రూ.15

అనంతపురం రూరల్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.15తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.9, సరసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,600 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు చేయూతనిస్తాం

● శాలివాహన కార్పొరేషన్ చైర్మన్



శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శాలివాహన కుటుంబాల్లోని చాలా మంది ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో చదువును అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారని ఏపీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ పేర్కొన్నారు. చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు చేయూత అందిస్తామన్నారు. మండలంలోని వంకమద్దిలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని శాలివాహనులు తరలి వచ్చారు. గ్రామానికి చెరుకున్న చైర్మన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన శాలివాహనల జీవన పరిస్థితులపై జిల్లా మం త్రి సవిత దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయించాలని శాలివాహనలు ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుళ్లాయమ్మ, అరుణ, నాగేంద్ర, గంగాధర్, సూర్యనారా యణ, నాగార్జున, రెడ్డెప్ప, చంద్ర, ఓబున్న, బయన్న, నాగరాజు, వేణు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం

ధర్మవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఆత్మీయ ట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. యూటీఎఫ్ ధర్మవరంజోన్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆయన శుక్రవారం ఎన్జీఓహోంలో విలేకరులతో తెలిపారు.

జిల్లా స్థాయి అవార్డు అందుకున్న తిప్పన్న



అవార్డు అందుకుంటున్న తిప్పన్న

బుక్కపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బులగుండ్ల తిప్పన్న జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఈఓ క్రిష్టప్ప చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్‌కు సన్మానం



క్రిష్ణమూర్తిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కదిరి అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్‌గా నియమితులైన బంగారు క్రిష్ణమూర్తిని ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆర్టీసి డిపో ఆవరణంలో ఆయనను పూలమాలలు, దుశాలువతో సన్మానించారు. క్రిష్ణమూర్తి ఆర్టీసీ కదిరి డిపోలో కండెక్టర్‌గా పనిచేస్తూ, స్వచ్ఛంద పదవీ వీమరణ చేశారన్నారు. ప్రస్తుతం ప్రజలకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని మునిసి పల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సాయిఆరామంలో శుక్రవారం సీఐటీయూ మూడో జిల్లా మహాసభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగభూషణ్ మాట్లాడుతూ... మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి వారికి భద్రత కల్పించాలన్నారు. సంక్షేమపథకాలను వర్తింప చేయాల న్నారు.కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తం ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనాలను ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరామమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాయిఆరామంలో శుక్రవారంనిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్ని పోరాటాలుచేసినా ప్రభుత్వాలు అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో అంగన్‌వాడీలకు కనీస వేతనాలను ఇస్తున్నారని మన రాష్ట్రంలోనూ ఇవ్వాలని డిమాండు చేశారు. అంగన్‌వాడీలను ఇతర పనులకు ఉపయోగించరాదని ఆమె డిమాండ్ చేశారు.

వైభవంగా ఓనం వేడుకలు



కేరళ సంప్రదాయ దుస్తుల్లో దీపోత్సవం నిర్వహిస్తున్న విద్యార్థినులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలతో ముడిపడిన విశిష్టమైన వ్యవసాయ పండుగ ఓనం అని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీ రింగ్ ప్రిన్సిపాల్ బాలకోటేశ్వరి పేర్కొన్నారు. పదిరోజుల పాటు నిర్వహించే ఓనం వేడుకలను జిల్లాకేంద్రంలోని సంస్కృతి స్కూల్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించి దీపోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు కేరళ జానపద నృత్య ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసంగించారు. అనంతరం ఓనం నేపథ్య ఫ్యాషన్‌షో, ఇంటర్ డిపార్టమెంటల్ టగ్‌ఆఫ్ వార్ వంటి స్నేహపూర్వక పోటీలు నిర్వహించి ఓనం సంబరాలు జరుపుకున్నారు. అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్





అతి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్

ధర్మవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎనిమిదో వార్డు కేశవనగర్‌లో విద్యుత్ తీగలు అతి తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. తక్కువ ఎత్తులో ఉం డటం వల్ల వాహనాలలో వెళ్లే వారికి తగిలే విధంగా ఉన్నాయి. ఈ విషయాన్ని పది నెలల నుంచి విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యహరి స్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికే చాలా మంది విద్యుదాఘాతానికి గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా ట్రాన్స్‌పార్మర్ మూడు అడుగుల ఎత్తులో ఉంది. అటు వైపు వెళ్లే చిన్నారులు, వృద్ధులు ఏమరపాటున అక్కడికి వెళితే విద్యుదాఘాతకానికి గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి ఈ విషయాన్ని తెలియజేశామని, అయినా ఈ సమస్యను పెడచెవిన పెడుతున్నారన్నారు. ప్రాణాలు పోతే కానీ విద్యుత్ అధికారులు స్పందించరా అని ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకా లంలో ప్రజలకు ప్రమాదం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికైన స్పందించి వెంటనే తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌పార్మర్‌ను ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వడ్డెర కార్పొరేషన్‌లో ఇద్దరికి చోటు



వలిపి శ్రీనివాసులు



శ్రీదేవి



నవీన్‌చంద్ర

పుట్టపర్తి/ హిందూపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లో జిల్లాకు చెందిన ఇద్దరికి డైరెక్టర్ పదవులు దక్కాయి. టీడీపీ కొత్తచెరువు పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, చిలమత్తూరు మండలానికి చెందిన శ్రీదేవిని కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డైరెక్టర్ల నియామకంలో పార్టీ విధేయులకు పట్టం కట్టారు. హిందూపురంలోని ప్రసిద్ధి చెందిన పేట వెంకటరమణస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా పట్టణానికి చెందిన నవీన్ చంద్రను నియమించారు. పాలకమండలి సభ్యులుగా తొమ్మిది మందికి అవకాశం కల్పించారు.

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే సింధూరరెడ్డి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 10న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనను విజయంతం చేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపినిచ్చారు, ఇందుకు సంబంధించి శనివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో కూటమి పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, తప్పక హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

సూపర్‌హిట్ సభపై
నేడు విస్తృతస్థాయి సమావేశం

ధర్మవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న జరిగే 'సూపర్‌సిక్స్-సూపర్‌హిట్‌సభ'పై శనివారం పట్టణంలోని టీడీపీ ఎర్రగుంట్ల కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అధ్యక్షతన మధ్యాహ్నం 3గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా నియోజకవర్గ కో ఆర్డినేషన్ కమిటీసభ్యులు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీఎస్సీఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ పరిశీలకులు నాగేంద్ర కుమార్ హాజరవుతారన్నారు. కావున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, తెలుగుమహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

ఇసుక అక్రమ రవాణాను ఆపాలి

● బీజేపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమ రవాణాను ఆపాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బీజేపీ పట్టణ కన్వీనర్ కళ్యాణ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి ప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. దీంతో ఇసుక అక్రమ రవాణాదారులు ఇష్టారా జ్యంగా ఇసుకను తోడేస్తూ చిత్రావతినదిని లూటీ చేస్తున్నారన్నారు. ప్రభు త్వ సెలవు దినాలు వస్తే చాలు ఇసుక అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతోందని దీన్ని అధికారుల అరికట్టాలన్నారు. ఈ అక్రమ రవాణాపై స్థానిక ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని ఇసుకాసురులను ఉక్కుపాదంతో అణిచివేయాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేంద్రబాబు, సాకే రామాంజినేయులు, నారాయణ, మధుసూదన్, బాలగంగాధర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

నంబులపూలకుంట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రానికి సమీపంలో ఓ ఆవు విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందింది. మండలకేంద్రంలో ఉంటున్న అనిల్‌కుమార్ గ్రామానికి సమీపంలోని దిగువపల్లి వద్ద రెండు పాడి ఆవులను మేతకు తోలుకెళ్లాడు. తిరిగి ఇంటి కొస్తున్న సమయంలో నేలమీద పడిన విద్యుత్ వైర్లపై వెళ్లిన ఆవు విద్యుదాఘాతమై అక్కడికక్కడే మృతిచెందిందని బాధితుడు అనిల్ తెలిపారు. రూ.లక్ష చేసే పాడి ఆవు మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్థులు అన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

8న సన్నాహక సమావేశం

● ఎమ్మెల్యే కందికుంట

కదిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈ నెల 10న నిర్వహించే 'సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ సభ'పై ఈ నెల 8న సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిన సందర్భంగా 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, తరలి రావాలని కోరారు. కార్యకర్తల సమీకరణలో భాగంగా ఈ నెల 8న స్థానిక పీఆర్‌గ్రాండ్‌లో కదిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. కూటమి నాయకులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతపురంలో జరిగే సమావేశానికి కూటమి ఎమ్మెల్యేలు 164 మందితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఆటస్థలాన్ని అంగుళం కూడా ఆక్రమించలేరు

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని కొంతమంది ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, అయిత అది ముమ్మాటికి పాఠశాలదేనని ఎమ్మెల్యే కందికుంట అన్నారు. పాఠశాల మైదానాన్ని అంగుళం కూడా ఎవరూ ఆక్రమించుకోలేరన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో కోర్టుకు తప్పుడు నివేదికలు అందజేసి, తాత్కాలికంగా వారికి అనుకూలంగా తీర్పులు తెచ్చుకున్నారన్నారు. ఆ మైదానాన్నిఎవరూ ఆక్రమించుకోలేరని, దీనిపై ఆందోళన వద్దన్నారు. ఇటీవల కొన్ని హోటళ్లలో శుచి, శుభ్రత, నాణ్యత లేని ఆహారాన్ని ప్రజలకు విక్రయిస్తున్నట్లు మున్సిపాలిటీ దాడుల్లో బయటపడిందన్నారు. అలా వడ్డిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పట్టణ, శివారు ప్రాంతాల్లోని టీ దుకాణాల్లో గంజాయితో పాటు ఇతర మత్తుపదార్థాలు తాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అలా దొరికితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమ ండ్ ఇర్ఫాన్, కన్వీనర్లు చెన్నకేశవులు, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టోకెన్ సిస్టం ద్వారా ప్రతిరైతుకు యూరియా



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

కొత్తచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంట సాగుచేసిన ప్రతి రైతుకు యూరియాను కొరత లేకుండా అందిస్తోంది. ఈ క్రమంలో మండల కేంద్రంలోని ప్రధాన మంత్రి రైతు సమృద్ధి కేంద్రం ద్వారా టోకన్ సిస్టంలో యూరియాను అందజేస్తున్నట్లు డీఏఓ రామూనాయక్ తెలిపారు. ప్రస్తుతం 8.1 టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. పంటలు సాగుచేసిన రైతులకు ఆధార్‌కార్డు ద్వారా తంబ్ వేయించుకుని ఒక్కో రైతుకు బస్తా చొప్పున శుక్రవారం వ్యవసాయ అధికారులు అందజేశారు. అయితే వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లేందుకు యూరియా కొరత ఉందని దుష్ప్రచారం చేస్తున్నారని వాటిని ఎవరు నమ్మవద్దని టీడీపీ స్థానిక నాయకులు పేర్కొంటున్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తు న్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘం నాయకులు



తనకల్లు ఎమ్మార్సీలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



బత్తలపల్లిలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



కదిరి షిర్డీసాయి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో గురుపూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆపస్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. సంఘం జిల్లా గౌరవసలహాదారుడు అన్నం అరవింద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పట్టణంలోని కాకతీయ పాఠశాల, పద్మావతి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎల్‌పీ సర్కిల్‌లోని పద్మావతి డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి చేతులమీ దుగా కేక్‌కట్ చేయించారు. ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు పిట్టా వెంకటస్వామి, అధ్యక్షుడు రమేశ్‌బాబు తదితరులు ఉపాధ్యాయులు విశ్వరూప్, గోవింద్, ఓబుశేషు, సుధాకర్‌ను ఘనంగా శాలువాలతో సత్కరించారు. బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హైస్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కదిరి పట్టణంలోని షిర్డీ సాయి హైస్కూల్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. అదేవిధంగా తనకల్లు ఎమ్మార్సీలో పలువురు ఉపాధ్యాయులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.



ధర్మవరం కాకతీయ పాఠశాలలో...



పద్మావతి డిగ్రీ కళాశాలలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం



ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

మానవతా విలువలు పాటించాలి

● ఎమ్మెల్యే కందికుంట ● ఘనంగా మిలాద్-ఉన్-నబీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌ప్రవక్త చెప్పిన విధంగా మానవతా విలువలు పాటిస్తూ పరమత సహనం, శాంతి, కలిగి ఉండాలని, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు శుక్రవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త చెప్పిన సందేశాలు అందరికి ఆచరణీయమే అన్నారు. ప్రతి ఒకరు వీటిని పాటించాలన్నారు. ఈ ర్యాలీలో ముస్లిం పెద్దలు, టీడీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ

● ధర్మవరం: పట్టణంలో ముస్లింలు మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన జెండాలను చేతపట్టుకుని ప్రధాన రహదారులలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీఐ నాగేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. అంతకుమునుపు చెరువుకట్ట వద్ద దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



● తాడిమర్రి: మండల కేంద్రంలోని మసీదులో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లిలందరూ మసీదు వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు.



● తనకల్లు: మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని మండలకేంద్రంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ముస్లింలు బీఎల్ అబ్దుల్‌కలాం, నిజాం తదితరులు పాల్గొన్నారు.

టోర్నీలో మైట్ వారియర్స్ ఘన విజయం

● నేడు క్వార్టర్ ఫైనల్స్



ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో 17వ రోజు శుక్రవారం జరిగిన అటల్ బిహారీ వాజ్‌పేయ్ క్రికెట్ టోర్నీ సీజన్-2 పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మొదటి మ్యాచ్‌లో బ్లూ క్యాప్స్, మైట్ వారియర్స్ జట్లు తలపడగా... మైట్ వారియర్స్ జట్టు 73 పరుగులు సాధించి ఘన విజయం సాధించింది. ఈ జట్టులో చెన్న అద్భుతమైన ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ దిమ్యాచ్‌గా ఎంపికయ్యాడు. దీంతో విజేతలకు బీజేపీ నాయకులు జ్ఞాపికలు అంద జేశారు. శనివారం క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కోనాపురంలో భక్తిశ్రద్ధలతో మారెమ్మ విగ్రహాన్ని గ్రామస్థులు ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆలయ జీర్ణోద్ధారణ పనులు ముగియడంతో అమ్మవారి విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. జలాధాకరణ, కలశస్థాపన తదితర పూజలను ఆలయ అర్చకులు అనంతరం శేషప్ప నిర్వహించారు. అగ్ని హోమం అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. విగ్రహప్రతిష్ఠాన మహోత్సవం వైభవంగా సాగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి, ఈశ్వరయ్య గీతావాణి, రోహిత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో షిర్డీసాయి బాబా విగ్రహం..


బాబా విగ్రహానికి ప్రత్యేక అలంకరణ

గోరంట్ల, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్కె. థియేటర్ వద్ద నూతనంగా నిర్మించిన షిర్డీసాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. బాబా విగ్రహంతో పాటు వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహలను ఏర్పాటు చేశారు. పురోహితులు భాస్కర్ తారానాథ్ శర్మ ఆధ్వర్యంలో 3 రోజులపాటు హోమాలు, గోపుర కలశ స్థాపన, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం, అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెరువుకట్ట ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఉన్న రైల్వేగేటువద్ద ఆగిఉన్న లారీని వెనుకవైపు నుంచి మరోలారీ ఢీకొనడంతో డ్రైవర్ శరబన్ తీవ్రంగా గాయపడ్డాడు. కియా ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు పెనుకొండ వైపు నుంచి అనంతపురంవైపు పెయింట్ లారీ వెళ్తోంది. కుంభకర్ణుని విగ్రహం వద్ద రైల్వేగేటు పడటంతో లారీ ఆగింది. ఈ క్రమంలో కర్ణాటక మంగళూరు నుంచి డ్రైవర్ శరబన్ పెంకుమట్టిని తాడిపత్రికి తరలిస్తుండగా ఆగిఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శరవన్ తీవ్రంగా గాయపడ్డాడు. గంటపాటు శ్రమించి ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వెలికితీసి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు

మండల కన్వీనర్ గోవిందరెడ్డి


యూజీ వెంకటేష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పరిగి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు దక్కుతాయని మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని శాసనకోట గ్రామానికి చెందిన యూజీ వెంకటేశ్‌ను రాష్ట్ర లైవ్‌స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంతో స్థానిక నాయకులు మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. తనకు పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి సవితను వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు బాలాజీ, మాజీ ఎంపీటీసీ సోమప్ప, క్లస్టర్ రామాంజి, రఘు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి శవం లభ్యం

సోమందేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పందిపర్తి గ్రామానికి వెళ్లే రహదారి బ్రిడ్జి వద్ద వృద్ధుడి శవం లభ్యమైంది. స్థానికులు సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందించారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

జయప్రదం చేయండి

సోమందేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎస్. రామచంద్రారెడ్డి 82వ జయంతిని పురస్కరించుకుని శనివారం పెనుకొండ మండలం కొండంపల్లి గ్రామంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని మండల కన్వీనర్ వెంకటేశులు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

సోమందేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీకి సంబంధించిన సమస్యలపై రైతులు జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు కాల్‌చేసి వివరాలను, ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ కార్యాలయం ద్వారా శుక్రవారం ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో స్థానిక వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సమాచారాన్ని అందజేశారు. అవసరమైనవారు నేరుగా 9948224545, 9177768274కు సంప్రదించాలన్నారు.

మూడోరోజుకు చేరుకున్న నిమజ్జనం

ముందస్తు చర్యలు తీసుకున్నా అంతే..

విధుల్లోనే పోలీసులు, మున్సిపల్ సిబ్బంది


శుక్రవారం రాత్రి వినాయక విగ్రహ నిమజ్జనం

హిందూపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎప్పటిలాగే ఈసారి కూడా హిందూపురంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం మూడోరోజుకు చేరుకోనుందంటే అవుననిపిస్తుంది. ఎందుకంటే గురువారం నిమజ్జనం ప్రారంభమైంది. శుక్రవారం రాత్రి 8 గంటలు దాటినా 5 పెద్ద విగ్రహాలు ఎంజీఎం పాఠశాల సమీపంలో ఆగిపోయాయి. ఈసారి వినాయక చవితికి నాలుగు నెలలు ముందుగానే కలెక్టర్, ఎస్పీ విగ్రహాల కమిటీల నిర్వాహకులతో సమావేశమయ్యారు. అయితే నిర్వాహకులు పోలీసులు చెప్పిన మాట ఒకటి చేస్తున్నది మరొకటని పోలీసులే అంటున్నారు. దీని వల్ల ఈసారికూడా మూడోరోజే నిమజ్జనం పూర్తయ్యే అవకాశం మెండుగా కనపడుతోంది. ఎందుకంటే ఇప్పుడాగిన పెద్ద విగ్రహాలు ఒక్కొక్కటి నిమజ్జనం చేయాలంటే 2గంటలపాటు అవుతోంది. దీంతో ఐదు విగ్రహాలు పూర్తికావడానికి మరో ఎనిమిది నుంచి 10 గంటలు పడుతుంది. ఈ లెక్కన తెల్లవారు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గుడ్డం సమీపంలో ఆగిన పెద్ద విగ్రహాలు



గురువారం మధ్యాహ్నం నిమజ్జనానికి తరలిన పెద్ద విగ్రహాలు రాత్రంతా ఊరేగి శుక్రవారం ఉదయం 7 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నాయి. అక్కడి నుంచి 400 మీటర్లు కదలడానికి రాత్రి 8 గంటలైనా గరిడి, కట్టకింద, బాపూజీనగర్, అంబేడ్కర్‌నగర్, యువసేన విగ్రహాలు ఆగాయి. ఎందుకని ప్రశ్నిస్తే ఈరోజు పదోరోజవుతుందని దీంతో అర్ధరాత్రి 12 గంటలు దాటాక నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు అంటున్నారు.

విధుల్లోనే పోలీసు, మున్సిపల్ సిబ్బంది

గురువారం ఉదయం 6 గంటలకే పోలీసులు విధుల్లోకి వెళ్లారు. అయితే విగ్రహాల వెంట పట్టణంలో ఉన్నవారు వారి పని పూర్తవ్వగానే వెళ్లిపోయారు. అయితే కోనేరువద్ద బందోబస్తుగా ఉన్న అధికారులు, సిబ్బంది శుక్రవారం సాయంత్రం వరకు ఉన్నారు. దీంతో పోలీసులు విగ్రహ కమిటీ నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేముకూడా మనుషులమే మాకు అలసట ఉండదా అంటూ బేజారు చేసుకున్నారు. దీంతో శుక్రవారం సాయంత్రం బయటి నుంచి వచ్చిన వారు విశ్రాంతికి వెళ్లగా స్థానిక సీఐలు అక్కడికి వెళ్లారు. అయితే వారుకూడా గురువారం ఉదయం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు కంటిమీద రెప్పలేకుండా విధుల్లో పాల్గొన్నారు. ఎస్పీ రత్న ఎన్నడూలేనివిధంగా ఈసారి స్వయంగా వీధుల్లో తిరుగుతూ నిర్వాహకులను అలర్ట్ చేశారు. అంతేకాక ఎస్పీ ఎక్కడెక్కడ సమస్యాత్మక ప్రాంతాలున్నాయో డ్రోన్ ద్వారా లైవ్ తిలకిస్తూ సూచనలు ఇచ్చారు. మొత్తానికి నిమజ్జనం ప్రశాంతంగా జరిగినా కొన్ని విగ్రహాలు నిర్వాహకుల తీరువల్ల పోలీసులు అసహనం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఈసారికూడా నిమజ్జనం మూడోరోజుకు చేరుకోనుంది.

నగర పంచాయతీ రూపురేఖలు మారుస్తా

బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత

రూ.92లక్షలతో సెంట్రల్ లైటింగ్‌కు భూమిపూజ


పెనుకొండలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ రూపు రేఖలు మార్చి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలో శుక్రవారం రూ.92లక్షలతో వైజంక్షన్ నుంచి మార్కెట్‌యార్డ్ వరకు సెంట్రల్ లైటింగ్‌కు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి రూ.50 లక్షలతో పూర్తిచేశామన్నారు. ఎప్పటి నుంచే ఇబ్బందులు పడుతున్న కోనాపురం తదితర గ్రామాలకు వెళ్లే రహదారిని రూ. కోటితో, డ్రైనేజీని రూ.50లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.62లక్షలతో శాశ్వతంగా అన్నాక్యాంటిన్ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరలో వంద కోట్లతో నగర పంచాయతీ పరిధిలో ఇంటింటికి తాగునీటిని అందిస్తామన్నారు. ప్రస్తుతం పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి సోలార్‌లైట్లు ఏర్పాటు చేశారన్నారు. అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ పెనుకొండ నగర పంచాయతీకి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న ఎంఐటీ లేఅవుట్‌కు రూ.16కోట్లు మంజూరయ్యాయని దానిని డెవలప్‌చేసి ఆన్‌లైన్‌లో కొనుగోలుచేసిన లబ్ధిదారులకు ఆయా స్థలాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, గుట్టూరు సూరి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, జనసేన కుమార్, ఎగువగడ్డ కృష్ణమూర్తి, రమణమ్మ, వీజీపాళ్యం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ద్రోహి జగన్ : మంత్రి సవిత

రొద్దం, (ఆంధ్రజ్యోతి): మహిళా ద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని మంత్రి సవిత విమర్శించారు. శుక్రవారం రూ.1.5కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జగన్‌కు సిలిండర్ల ధరలు పెంచడం తెలుసుకాని ఉచిత గ్యాస్ ఇవ్వడం తెలియదన్నారు. బస్సు చార్జీలు పెంచడం జగన్‌కు ఎరుక గాని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం చేతకాలేదని ఎద్దేవా చేశారు. చిన్నకోడిపల్లి గ్రామానికి 35 ఏళ్ల కలను సాకారం చేశామన్నారు. డీఆర్ కొట్టాల గ్రామంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించడానికి విద్యుత్‌శాఖ మంత్రిని ఆహ్వానించనున్నామన్నారు. చిన్నకోడిపల్లి గ్రామంలో కనకదాస విగ్రహ ఏర్పాటుకు విగ్రహాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్ రాజు, టీడీపీ నాయకులు మాధవనాయుడు, నారాయణస్వామి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, నరహరి, చంద్రమౌళి, వీరాంజనేయులు, రామచంద్ర, అశ్వర్థనారాయణ, పవన్, అరుణ్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయక లడ్డూ వేలం


21 అడుగుల స్వామివారి విగ్రహం

రొద్దం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రొద్దంలోని వరసిద్ధి వినాయకుని 25 కేజీల నేతి లడ్డును శనివారం వేలం వేయనున్నట్లు వినాయక సేవా సమితి ప్రతినిధులు వేణుగోపాల్, పవన్, రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రొద్దం చావిడిలోని వినాయక విగ్రహంవద్ద లడ్డువేలంపాట ఉంటుందని మండలంలోని భక్తులు, నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. అనంతరం వినాయక నిమజ్జనం నిర్వహించడం జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం


నిమజ్జనంలో పాల్గొన్న యువత

అగళి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఆనందోత్సవాల మధ్య వినాయక నిమజ్జన జరిగింది. వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రంగులు చల్లుకుంటూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. ఏఎస్ఐ శ్రీరాములు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంఎస్ రాజు

అమరాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామంలో వైసీపీ నుంచి ఐదు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు హళ్లేరు శ్రీనివాస్, ఉగ్రప్పగారి శివన్న, యాదవ జయప్ప తదితరులు తెలిపారు. పార్టీలో చేరినవారిని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కండువావేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ స్వరక్క, నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ పాండురంగప్ప, పంచాయతీ కన్వీనర్ మాజీ ఎంపీటీసీలు మంజునాథ్, నరసింహమూర్తి, ముద్దయ్య, చంద్రప్ప, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మడకశిర కీర్తిని చాటాలి: ఎమ్మెల్యే

మడకశిరటౌన్, (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో మడకశిర కీర్తిని చాటాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తున్న క్రీడాకారులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి అభినందించారు. రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీల్లో విజయం సాధించి వెనకబడిన ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అభిమన్యు యూత్ అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, అగళి జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు కుమారస్వామితోపాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ


గుడిబండలో ద్విచక్రవాహనాలతో ముస్లింల ర్యాలీ

మిలాద్-ఉన్-నబీపండుగను ముస్లింలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒకొరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని మతగురువులు ఈ సందర్భంగా సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ, శాంతి, సహనంతో జీవించాలని ఆకాంక్షించారన్నారు. ఆయన సందేశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం మహ్మద్ ప్రవక్త కేశాన్ని భక్తులు దర్శించుకున్నారు.
(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)


అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముద్దిరెడ్డిపల్లిలోని నందిసర్కిల్ సమీపంలో చౌడేశ్వరీ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. బెంగళూరుకు చెందిన వేద పండితులు సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో జరిగిన భూమిపూజ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బండారుబాలాజీ, కౌన్సిలర్లు జయప్ప, పల్లాకుమార్, కోరుముట్ల నాగేంద్ర, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


సీనియర్ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

మడకశిరటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన జిల్లా అధ్యక్షులు మారుతీ మాట్లాడుతూ సమాజానికి ఉపాధ్యాయులే మార్గదర్శకులని ఉపాధ్యాయుల సేవలు సమాజానికి వెలకట్టలేనివని, గురువు ఉన్నచోట జ్ఞానం ఉంటుందని, తద్వారా సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ఈసందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు రామకృష్ణ, దేవరాజ్‌లను సన్మానించారు. ఏపీ స్కూల్‌టీచర్స్ అసోసియేషన్ నాయకులు ప్రదీప్‌కుమార్, రమేష్, మంజునాథ్, అర్జున్, అశ్వర్థనారాయణ, మారుతీ, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్‌లో ఇద్దరికి చోటు


వలిపి శ్రీనివాసులు


శ్రీదేవి


నవీన్‌చంద్ర

పుట్టపర్తి, హిందూపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌లో జిల్లాకు చెందిన ఇద్దరికి డైరెక్టర్ పదవులు దక్కాయి. టీడీపీ కొత్తచెరువు పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, చిలమత్తూరు మండలానికి చెందిన శ్రీదేవిని కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డైరెక్టర్ల నియామకంలో పార్టీ విధేయులకు పట్టం కట్టారు. హిందూపురంలోని ప్రసిద్ధి చెందిన పేట వెంకటరమణస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా పట్టణానికి చెందిన నవీన్ చంద్రను నియమించారు. పాలకమండలి సభ్యులుగా తొమ్మిది మందికి అవకాశం కల్పించారు.

వైభవంగా ఓనం వేడుకలు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలతో ముడిపడిన విశిష్టమైన వ్యవసాయ పండుగ ఓనం అని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీ రింగ్ ప్రిన్సి పాల్ బాలకోటేశ్వరి పేర్కొన్నారు. పదిరోజులపాటు నిర్వహించే ఓనం వేడుకలను జిల్లాకేంద్రంలోని సంస్కృతి స్కూల్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించి దీపోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు కేరళ జానపద నృత్య ప్రదర్శన చేశా రు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసంగించారు. అనంతరం ఓనం నేపథ్య ఫ్యాషన్‌షో, ఇంటర్ డిపార్టమెంటల్ టగ్‌ఆఫ్ వార్ వంటి స్నేహపూర్వక పోటీలు నిర్వహించి ఓనం సంబరాలు జరుపుకున్నా రు. అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.